క్లుప్తంగా

గుండ్లపల్లిలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి



నకరికల్లు: వరిలో ఆకుచుట్టు పురుగు, సుడిదోమ, వరికాండం తొలుచు పురుగు కనిస్తోందని ఐదు శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలని వ్యవసాయశాఖ ఏడీ బత్తుల శ్రీకృష్ణదేవరాయలు రైతులకు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చార్టులపై బొమ్మలు గీసి రైతులకు అవగాహన కల్పించారు. మిత్ర, శత్రు పురుగుల మధ్య తేడాను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బొల్లవరంలో ఫ్యామిలీ పిజీషియన్

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, సూర్యప్రకాశరావు పాల్గొని 75 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు పీటర్ డానియేన్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎం అనురాధ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో 'కాశీనగర్ 1947' చిత్రం షూటింగ్



సత్తెనపల్లి: మండలంలోని లక్కరాజుగార్లపాడు పొలాల్లో 'కాశీ నగర్ 1947' చిత్రం చిత్రీకరణ శుక్రవారం జరిగింది. శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రాయదుర్గం రమాదేవి రెడ్డి నిర్మిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పట్టణాధ్యక్షుడు వల్లెం నరసింహారావు కెమెరా స్విచ్ ఆన్ చేసి షూటింగును ప్రారంభించారు. పట్టణం పరిధిలో పలు ప్రాంతాల్లో సినిమాలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. మక్కెన వెంకట్రావు ఆధ్వర్యంలో నటీనటులు చెన్న కేశవ నాయుడు, మర్రి వెంకట సుబ్బారెడ్డి, జొన్నలగడ్డ రత్నరాజు, షేక్ సైదా, రాప్రోలు రాఘవరావు నటించారు.

దుకాణాల వేలం ఆదాయం రూ.27.36లక్షలు

అమరావతి: అమరావతిలోని అమరేశ్వరాలయంలో దుకాణాలకు దేవాదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులకు మేరకు శుక్రవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈఓ సునీల్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు దుకాణాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయానికి పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వేలం వాయిదా వేశామన్నారు. కొబ్బరి చిప్పల సేకరణ రూ.6.85లక్షలకు, నదీతీరం, దేవాలయ మొదటి ప్రాకారంలో కూల్‌డ్రింక్స్ దుకాణాలు రూ.4.5లక్షలు, రూ.93వేలు, బొమ్మల విక్రయం రూ.3.5లక్షలు, చెప్పులు భద్రపరుచుకోవడం 2లక్షలు, వాహనాల పార్కింగ్ రూ.9.41 లక్షలు, తలనీలాల హక్కులను రూ.17 వేలకు పాటదారులు దక్కించుకొన్నట్లు ఆయన తెలిపారు. మొత్తం రూ.27.36 లక్షలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

సత్తెనపల్లి: వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ నెల 12న నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం పిలుపునిచ్చారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను శుభ్రపరిచాలన్నారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఉదయం పార్టీ జెండాను ఆవిష్కరించి, వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని, పార్టీ బాధ్యులు కార్యక్రమాలను నిర్వహించాలని స్పష్టం చేశారు.

వంటింటి ఖర్చు.. ఇల్లాలు నొచ్చు..!

- గ్యాస్ సిలిండర్ మరింత భారం
- సత్తెనపల్లి డివిజన్‌లో రూ.60లక్షల అదనం
- ఆందోళనలో పేద, మధ్యతరగతి ప్రజలు

సత్తెనపల్లి: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో ఆందోళనకు గురవుతున్న సామాన్యులకు వంట గ్యాస్ ధర పెంపు అదనపు భారంగా మారింది. ఇప్పటివరకు 14 కిలోల సిలిండర్ ధర రూ.1094.50 ఉండగా అది కాస్త రూ.1,144.50 లకు చేరింది. గ్యాస్ ఏజెన్సీ నుంచి అయిదు కిలోమీటర్ల లోపు వీటిని ఉచితంగా రవాణా చేయాలని అధికారులు ఆదేశాలిస్తున్న నిర్వాహకులకు పట్టడం లేదు. దీంతో గ్యాస్ ఏజెన్సీ నుంచి వినియోగదారుడి ఇంటికి దూరం పెరిగే కొద్దీ సిలిండర్‌కు రూ.20 నుంచి రూ.50 వరకు అనధికారికంగా రవాణా చార్జీలు కలుపుకుని గ్యాస్ బండకు రూ.1,200 వరకు చెల్లించాల్సిన పరిస్థితి. వినియోగదారులకు ప్రభుత్వం సిలిండర్‌పై ఇచ్చే రాయితీని నేరుగా వారి బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తుంది. ఆ సొమ్ము రాను రాను తగ్గిపోతోంది.

ఏడాదిన్నరలో ధర పెరుగుదల ఇలా..

గ్యాస్ ధర పెరిగిన తేదీ	ధర (రూ.లలో)	పెరుగుదల (రూ.లలో)
2021 జూలై 1	863.00	0
2021 ఆగస్టు 17	888.00	25.00
2021 సెప్టెంబర్ 1	913.00	25.00
2021 అక్టోబర్ 6	928.00	15.00
2022 మార్చి 22	978.00	50.00
2022 మే 7	1,028.00	50.00
2022 మే 19	1,031.50	3.50
2022 జూలై 6	1,051.50	50.00
2023 ఫిబ్రవరి 1	1,130.50	50.00



సత్తెనపల్లి ఇండేన్ గ్యాస్ గోదాంలో సిలిండర్లు

రూ. 60లక్షల అదనపు భారం

సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు, నియోజకవర్గాల్లో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ, మండలాలున్నాయి. వీటి పరిధిలో ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ ఏజెన్సీలు 11 ఉన్నాయి. ఈ గ్యాస్ ఏజెన్సీల పరిధిలో సుమారు 1,60,000 కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెల సరాసరిన 1.20 లక్షల సిలిండర్లు వినియోగిస్తుంటారు. ఈ లెక్కన ప్రస్తుతం పెంచిన ధర రూ.50 ప్రకారం నెలకు సుమారు రూ.60 లక్షల అదనపు భారం పడుతుందని అంచనా. వాణిజ్య సిలిండర్‌కు ఒక్కొక్క దానికి రూ.350వరకు పెంపుదల చేశారు.



నిత్యావసర సరుకులు

గతేడాది జూలైలోనూ ఇదే విధంగా గ్యాస్ ధర రూ.50 పెంచారు. ఏటేటా ఇలా గ్యాస్ ధర పెంచుకుంటూ పోతే తామెలా బతకాలని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ ధర తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్యాస్ ధర పెరుగుదలతో..వంటింటి ఖర్చు అధికమైందని పలువురు గృహిణులు తమ ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

గ్యాస్‌పొయ్యి వెలిగించాలంటే..



గ్యాస్ సిలిండర్ ధర పెంచడం సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి భారంగా మారింది. ఇప్పటికే అన్ని రకాల వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. గ్యాస్ ధరలు పెరుగుతుండడంతో పొయ్యి వెలిగించాలంటేనే భయమేస్తుంది. సామాన్యుల గురించి పాలకులు ఆలోచించాలి. గ్యాస్ ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

–పి.శివకుమారి, మహిళ, సత్తెనపల్లి

పూర్తి ధరకు కొంటున్నట్లుంది



ధరలు తగ్గించి పేదలను ఆదుకోవాల్సిన పాలకులు ఇలా పెంచుకుంటూ పోవడం సరికాదు. నిత్యావసర ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుంటే వంట గ్యాస్ ధర కూడా పెంచడం దారుణం. దీంతో ఖర్చులు పెరిగి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పేద కుటుంబాలకు ధరలో మినహాయింపు ఇవ్వాలి. ధర పెంచినా..రాయితీ పెంచడం లేదు. పూర్తి ధరకు గ్యాస్ కొంటున్నట్లుంది.

–జి.రోజారాణి, మహిళ, సత్తెనపల్లి

భవిష్యత్తు తరాల కోసం సీఎం వైఎస్ జగన్ తపన

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: భవిష్యత్తు తరాల కోసం సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి అహర్నిశలు కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మిట్టపాలెంలో రూ.23లక్షలతో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో కలసి భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇచ్చిన మహిళలకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రతిగా వారికి కేటాయించి స్థల పట్టాలను పంపిణీ చేశారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ రాజు, నెల్లూరి చంద్రబాబు పాల్గొన్నారు.

చింతగుంట్ల రామిరెడ్డి విగ్రహావిష్కరణ

అచ్చంపేట: వైఎస్సార్ సీపీ నాయకుడు, చెరుకుంపాలెం మాజీ సర్పంచ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ దివంగత చింతగుంట్ల రామిరెడ్డి విగ్రహాన్ని చెరుకుంపాలెంలో శుక్రవారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో కలసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆవిష్కరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన రామిరెడ్డిని కోల్పోవడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే నంబూరు సంతాపం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు హనుమంత రెడ్డి సర్పంచ్‌గా సేవలందిస్తున్నట్లు తెలిపారు. నాలుగు తరాల వారు ప్రజాసేవలో ఉండి, ప్రజామోదం పొందడం అరుదని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.



రామిరెడ్డి విగ్రహావిష్కరణలో ఎంపీ, ఎమ్మెల్యే

నేటి నుంచి ప్రసన్నాంజనేయుని ఉత్సవాలు

రాజుపాలెం: ఆకుల గణపవరం శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఉత్సవాలకు దేవాలయం ముస్తాబయ్యింది. శనివారం నుంచి ఈ నెల 15వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ప్రతి రోజు పూజా కార్యక్రమాలు, ఎడ్ల పందేలు, అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు సరస్వతి శిశు మందిర్ 21వ వార్షికోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డు వావిలాల వారి వీధిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాల 21వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని పాఠశాల నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల సమాగ్రాభివృద్ధి కృషి చేస్తున్నట్లు ఎంపీడీఓ వై.రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి వసతి, మౌలిక వసతులు కలిప్తున్నట్లు తెలిపారు. మండలానికి జల జీవన్ మిషన్ ద్వారా రూ.15.38కోట్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ తెలిపారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, వైస్ ఎంపీపీలు నన్నే, లక్ష్మయ్య, కో–ఆప్షన్ మెంబర్ జాని, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నకరికల్లు: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రూఫస్ డానియేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్లలోని 132కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు జరుగుతున్నాయని విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమరావతిలో..

అమరావతి: అమరావతి, ఉంగుటూరు, మల్లాది సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అమరావతి మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజుపాలెం: మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వి.జ్ఞానేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పెదకూరపాడు పెదకూరపాడు, 75 త్యాళ్లూరు సబ్ స్టేషన్‌ల పరిధిలో రెండో శనివారం సందర్భంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లి చేరుకున్న 'బోలా' సైకిల్ యాత్ర

సత్తెనపల్లి: గుజరాత్‌కు చెందిన రాసిక్ నానాలాల్ బోలా అనే వ్యక్తి సైకిల్ పై చేపట్టిన భారత్ తీర్థ యాత్ర శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి చేరుకుంది. పట్టణంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయానికి ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా బోలా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీముఖ లింగం, శ్రీకూర్మం, అర్సవల్లి, సింహాచలం, అన్నవరం, ద్రాక్షారామం మీదుగా యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. శ్రీలక్ష్మి తిరుపతమ్మ దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం సేవకులు తురక శ్రీనివాసరావు, షేక్ మాబు సుబాని ఆయనకు ఆహ్వానం పలికారు.



మాట్లాడుతున్న రాసిక్ నానాలాల్ బోలా

నేడు 'ఉపాధి' తనిఖీ ప్రజావేదిక

క్రోసూరు: మండలంలోని 2021–22లో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక జరుగుతుందని ఏపీఓ వెంకటనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 489 పనులకు ఖర్చుచేసిన రూ.4.97 కోట్లు, అదేవిధంగా పంచాయతీ రాజ్ 58 పనులకు ఖర్చుచేసిన రూ.3.80 కోట్లు, స్కూల్ ఎడ్యుకేషన్ 3 పనులకు చేసిన రూ. 10 లక్షల ఖర్చుపై ప్రజావేదిక జరుగుతుందని తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఏపీడీ రఘు, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీలాగపూర్ హాజరవుతారని తెలిపారు.

రీ-సర్వేను వేగవంతం చేయండి

పెదకూరపాడు : భూముల రీ–సర్వేను వీఆర్వోలు, సర్వేయర్లు వేగవంతం చేయాలని సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి సూచించారు. పెదకూరపాడు తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లక్ష్యాలను సాధించాలన్నారు. చినమక్కెన గ్రామంలో సర్వేను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు క్షమారాణి, సర్వేయర్ మాధవి, ఆర్ఐ దాసు పాల్గొన్నారు.



వైద్య సేవల్లో నిర్లక్ష్యం.. సహించేది లేదు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ప్రజలకు అందుబాటులో ఉండి, వైద్యసేవలు సక్రమంగా అందించకపోతే సహించేది లేదని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పీహెచ్‌సీ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో ఇద్దరు వైద్యులు లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు, హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. వైద్యులు సక్రమంగా ఉండరని, రక్త పరీక్షలు సరిగా చేయడం లేదని, వైద్యశాలలో లభించాల్సిన మందులు బయట మెడికల్ షాపులో దొరుకుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. ఒకరిద్దరు సిబ్బందే వైద్యశాలపై పెత్తనం చలాయిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ.. అందరూ ప్రజా సేవకులేనని, ప్రజలకు జవాబుదారితనంగా ఉండకపోతే సెలవులో వెళ్లిపోవచ్చన్నారు. తనకు సక్రమంగా పనిచేసే సిబ్బంది మాత్రమే కావాలన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో లేనప్పుడు ఉపయోగమేంటని ప్రశ్నించారు. వైద్యులు లేకపోవడంవల్లనే ఓపీ తగ్గిపోయిందని, రోగులు ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనికృష్ణానాయక్, మండల పార్టీ కన్వినర్ చిల్కా చంద్రయ్య, ఉప ఎంపీపీ గంగసాని బాబు తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

నులిపురుగుల మాత్రలు పంపిణీ

నకరికల్లు: ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం పల్నాడు జిల్లా అధికారి డాక్టర్ హనుమకుమార్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న నుంచి ఏఎన్ఎం, ఆశా వర్కర్‌ల పర్యవేక్షణలో పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఒక మాత్ర వేసుకునేలా విద్యార్థులకు సూచించాలన్నారు. ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి, కుంకలగుంట, నకరికల్లు పీహెచ్‌సీల వైద్యాధికారులు కె.మురళికృష్ణ, వి.శ్రీనునాయక్, మండల కో–ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మాత్రలు పంపిణీపై సమీక్ష..

పెదకూరపాడు: పౌష్టికాహార లోపం, రక్తహీనత ఉన్న బాలబాలికలకు నులుపురుగు మాత్రలు అందించాలని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెలిగొండారెడ్డి సూచించారు. ఎంపీడీఓ మార్చి14న జాతీయ నులు పురుగుల నివారణ కార్యక్రమంపై.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెలిగొండారెడ్డి మాట్లాడుతూ మండలంలో 8 వేల మంది విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దిలీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ మున్ని తదితరులు పాల్గొన్నారు.



మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ హనుమకుమార్

పేదల కోసం పనిచేసిన గురవయ్య

సత్తెనపల్లి: వివాద రహితుడు, మృదుస్వభావి దివంగత సీపీఐ నేత, ధూళిపాళ్ళ ఆంధ్రాబ్యాంకు రైతు సహకార సంఘం అధ్యక్షుడు నరిశేటి గురవయ్య తుదిశ్వాస వరకు తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పేదల కోసం పనిచేశారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన 5వ వర్ధంతి లెలిన్ నగర్‌లోని నరిశేటి గురవయ్య పార్క్‌లో శుక్రవారం నిర్వహించారు. గురవయ్య విగ్రహానికి కుటుంబ సభ్యులు, సీపీఐ శ్రేణులు, పలు రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల నేతలు, లెలిన్‌నగర్ వాసులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎస్టీయూ, రైతు సంఘం, సీపీఐలో పలు కీలక పదవులు నిర్వహించడంతో పాటు సత్తెనపల్లి 2వ వార్డు కౌన్సిలర్‌గా, గుంటూరు జిల్లా పరిషత్ ప్రణాళికా సంఘం సభ్యుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ సందర్భంగా మాతశ్రీ మొల్లమాంబ వద్ధాశ్రమంలో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్, సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.ఇర్మియా, నరిశేటి తాండవ క్రిష్ణ, ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సత్తెనపల్లి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురవయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాదా బైనామా భూముల క్రమబద్ధీకరణ

నకరికల్లు: సాదా బైనామా భూములను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఫారం–10 ద్వారా డిసెంబర్ 31లోగా సచివాలయంలో అర్జీదాఖలు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన శుక్రవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 2021 నాటికి తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సచివాలయం ద్వారా దాఖలు చేసుకున్న అర్జీలకు రెవెన్యూ విచారణ జరిపి ఫారం–13బీ ద్వారా ధృవీకరణ పత్రం మంజూరు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ పురుషోత్తం, వీఆర్వోలు పాల్గొన్నారు.



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దారు

నిమ్న వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

సత్తెనపల్లి: నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ సంఘ నాయకులు కొనియాడారు. సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని పురస్కరించుకొని బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గరలోని ప్రాథమిక పాఠశాలలో ఆమె చిత్రపటానికి శుక్రవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంటూరు గోవిందు, గుంజి విజయ్, ప్రత్తిపాటి హరేకృష్ణ, గంప నరసింహారావు, షైక్ చిన్న షరీఫ్, పాఠశాల హెచ్ఎం ఎంవీఎల్ శివన్నారాయణ, ఉపాధ్యాయురాలు కె.బాల శౌరీ, పి.వెంకట రమణి బాల, బాలికలు తదితరులు పాల్గొన్నారు.